క్లుప్తంగా

నేడు గృహసారథులు, కన్వీనర్లతో సమావేశం

చెరుకుపల్లి: చెరుకుపల్లిలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండలరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు ఎంపి మోపిదేవి వెంకట రమణారావు పాల్గొంటారని చెప్పారు. సమావేశానికి మండలంలో గ్రామాల వారీగా ఎంపిక చేసిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల గ్రామ స్థాయి నాయకులు అందరు హాజరు కావలని కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

పిట్టలవానిపాలెం: మండలంలోని భవనంవారి పాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఎంపీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సింధు, నాయకుడు కోటిరెడ్డిలు సంయుక్తంగా తెలిపారు. వైఎస్సార్ సీపీ ఏర్పాటు చేసి 12 ఏళ్లు పూర్తి చేసుకుని 13వ ఏడాదిలోకి అడుగు పెడుతున్న సందర్భంగా గ్రామంలో బాపట్ల శాసన సభ్యుడు కోన రఘుపతి పార్టీ జెండాను ఆవిష్కరిస్తారని తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

'అగ్ని' బాధితులకు చేయూత



కర్లపాలెం: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సంస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని రెడ్‌క్రాస్ కర్లపాలెం మండల చైర్మన్ ఇనకొల్లు పోలీస్‌రావు తెలిపారు. యాజలి గ్రామంలో కాగిత పెద్దోడు.. అక్కిరాజుదిబ్బ ఎస్టీ కాలనీలో కడలి సాయికృష్ణల పూరిగృహాలు ఇటీవల వేరు వేరుగా జరిగిన అగ్ని ప్రమాదాలలో పూర్తిగా దగ్ధమవటంతో నిరాశ్రయులయ్యారు. శనివారం కాగిత పెద్దోడు, కడలి సాయికృష్ణల కుటుంబాలకు రెడ్‌క్రాస్ తరపున ఇనకొల్లు పోలీస్‌రావు రెడ్‌క్రాస్ కిట్‌తో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఓబద్య తదితరులు ఉన్నారు.

భట్టిప్రోలు హైస్కూల్‌లో సమీక్ష సమావేశం

భట్టిప్రోలు: పదవ తరగతి పరీక్షలు సమీపిస్తుండడంతో శనివారం భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్ కరస్పాండెంట్ పి. మల్లిఖార్జునరావు క్రమశిక్షణ, విద్య ఆవశ్యకతను తెలియజేశారు. హెచ్‌ఎం సి. రామకోటేశ్వరరావు పరీక్షలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సన్నద్ధమయ్యే విధానం, పరీక్ష పేపర్లు, బోధనా పద్ధతులు, చదివే విషయంలో జరిగే లోపాలను గూర్చి వివరించారు. ఉపాధ్యాయులు ఎం.శ్రీ సత్యరత్న, మురళీధరరావు, సుబ్బారావు, లక్ష్మీ పార్వతి, విద్యా వలంటీర్లు పాల్గొన్నారు.

స్టీరింగ్ విరిగి ఆగిన లారీ

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

భట్టిప్రోలు: భట్టిప్రోలు రైల్వేగేట్ సమీపంలో మెయిన్‌రోడ్డుకు వెళ్లే రహదారి మార్గంలో ఓ లారీ స్టీరింగ్ విరిగిపోయి నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వెల్లటూరు వైపు నుంచి వెయిట్‌లెస్ రాళ్ల లోడుతో వస్తున్న లారీ శనివారం భట్టిప్రోలు రైల్వేగేట్ వద్ద మలుపునకు వచ్చేసరికి స్టీరింగ్ విరిగిపోయింది. లారీ నిలిచిపోవడంతో రథం సెంటర్‌వైపు నుంచి వచ్చే వాహనాలు వెనక్కి మళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాయంత్రం వరకు లారీ తీయకపోవడంతో ప్రైవేట్ స్కూల్, కళాశాలల బస్సులు, వాహనదారులు, రైల్వే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు సత్వరం చేపట్టాలి

అన్నవరం(కొల్లిపర): జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు తప్పనిసరిగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, నిర్మాణాలు చేపట్టని వారి జాబితా త్వరలో ఉన్నత అధికారులకు నివేదిక పంపనున్నట్లు తహసీల్దార్ జి.నాంచరయ్య, ఎంపీడీఓ పి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండలంలోని అన్నవరం గ్రామంలో జగనన్న కాలనీల్లో హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, డ్వాక్రా గ్రూపులకు అందిస్తున్న రుణాలు గురించి వివరించారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సుబ్బారావు, సర్పంచ్ తాత శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో 38మంది ఎంపిక

తెనాలిఅర్బన్: ఐఎల్‌ఎం కంపెనీ శనివారం జేఎంజే మహిళా కళాశాలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌ను నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు గ్రూపు డిస్కర్షన్స్, ఇంటర్వ్యూలను నిర్వహించారు. మొత్తం 198మంది విద్యార్థినులు పాల్గొనగా, 38 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ తెలిపారు. అనంతరం వారిని కళాశాల ఆవరణలో అభినందించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ థెరిస్సామ్మ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ శారద, ఐఎల్‌ఎం సంస్థ హెచ్‌ఆర్ బాషా, ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ జి.సుధాకరయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి
- చందోలులో గడప గడపకు మన ప్రభుత్వం



నవరత్నాల కరపత్రాన్ని అందిస్తున్న బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో తాగునీరు, డ్రైనేజి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గ్రామ సర్పంచి గౌరీదేవి విజయకుమారి, మునీర్, పార్టీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ షేక్ బాజి, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అహ్మద్ హుస్సేన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అంటూ ప్రజలను ఆరా తీశారు. అలాగే గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చందోలులో ఎంతోకాలంగా తాగునీటి సమస్య, మురుగునీటి సమస్యను ప్రధానంగా గుర్తించామన్నారు. రూ.2.86కోట్లు మురుగునీటి సమస్య పరిషారానికి నిధులు మంజూరు చేశామని, అయితే కోవిడ్ కారణంగా రూ.33 లక్షలు మాత్రమే ఖర్చు చేయడం జరిగిందన్నారు. మిగిలిన నిధులను రెన్యువల్ చేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా పైపులైను పనులు జరుగుతున్నాయని తెలిపారు. కొత్తగా గ్రామంలో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం కోసం స్థల సేకరణ జరుగుతుందని తెలిపారు. బాపట్ల ఏఎంసీ వైస్ చైర్మన్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, బాపట్ల ఏఎంసీ డైరెక్టర్ కనికిచర్ల వెంకటప్రసాద్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు చేబ్రోలు కృపానందం, ఎంపీటీసీ సభ్యులు కరీమున్నీసా, చల్లాపల్లి విజయరాజు, గ్రామ ఉపసర్పంచి చేబ్రోలు వీరయ్య, గోవతోటి విజయ్, పార్టీ రాష్ట్ర నాయకులు మండే విజయ్‌కుమార్, చేబ్రోలు రవికుమార్, బాపట్ల జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, దబ్బకూటి మాధవరావు, బడుగు ప్రకాశరావు, వాలి శివారెడ్డి, కూసంపూడి దేవేంద్రరాజు, కోటిరెడ్డి, కుంభం ప్రసన్నరాజు, యోహాను, గుమ్మడి సీతయ్య, ఎంపీడీఓ కొల్లిపర పద్మజ, గ్రామ కార్యదర్శి శేష గిరారావు, పంచాయతీరాజ్ ఏఈ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

నేడు ముత్తాయపాలెంలో కళ్లజోళ్ల పంపిణీ

బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు(గుంటూరు): బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 'జగన్నామ సంక్షేమ సంవత్సరం' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6వ తేదీన బాపట్ల నియోజకవర్గంలోని ముత్తాయపాలెం గ్రామంలో జరిపిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో కళ్లజోళ్లు అవసరమైన వారికి ఆదివారం కళ్లజోళ్లు పంపిణీ చేయనున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం ఆరు రోజుల వ్యవధిలోనే కళ్లజోళ్లు అవసరమైన సుమారు 508 మంది పేద, నిరుపేదలు, మత్స్యకారులకు కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం 3.30 గంటలకు ముత్తాయపాలెం గ్రామంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కళ్లజోళ్లకు ఎంపికైన వారంతా ముత్తాయపాలెం ఆంజనేయస్వామి విగ్రహం వద్దకు విచ్చేసి తమ కళ్లజోళ్లను పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మహిళా సర్పంచ్‌పై యువకుడి దాడి



డాక్టర్ ప్రీతిని పరామర్శిస్తున్న సర్పంచ్‌ల సంఘం నాయకులు

తెనాలిరూరల్: తెనాలి మండలం కొలకలూరు గ్రామ మహిళా సర్పంచ్‌పై అదే గ్రామానికి చెందిన యువకుడు దాడి చేశాడు. తనపై జరిగిన దాడి గురించి సర్పంచ్ ఫిర్యాదు చేయగా, సదరు యువకుడూ సర్పంచ్ తనపై దాడి చేసిందని ఫిర్యాదు చేశారు. రెండు ఫిర్యాదులపై కౌంటర్ కేసులు నమోదయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కొలకలూరు గ్రామంలో రెండు కుటుంబాలకు నడక దారి విషయంలో వివాదం ఉంది. ఇందులో ఓ కుటుంబం గ్రామ సర్పంచ్ డాక్టర్ చొప్పర ప్రీతి బంధువులది కాగా మరో కుటుంబం అదే గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ కార్యకర్త పొన్నెకంటి రమేష్ బంధువులది. ఇటీవల దారిలో సర్పంచ్ వర్గీయులు మట్టి, రబ్బీస్ తోలించారు. తమను నడవకుండా చేసేందుకే ఇలా చేశారని వైరి వర్గంవారు ఆరోపించారు. ఈ విషయమై మాట్లాడేందుకు రమేష్ అతని బంధువులు సర్పంచ్‌ను శుక్రవారం రాత్రి పిలిపించారు. చర్చలు జరుగుతుండగా రమేష్, ప్రీతి మధ్య వాగ్వాదం జరిగింది. రమేష్ దాడి చేయగా వెనక్కు పడిన సర్పంచ్ గాయపడగా తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనతో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా తనపై దాడి చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. కాగా తనపై సర్పంచ్ దాడి చేసి అసభ్యంగా దూషించిందని రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు కేసులను శనివారం నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు తెలిపారు. సర్పంచ్‌పై దాడి సమాచారం అందుకున్న రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, జిల్లా అధ్యక్షుడు ముప్పాళ్ల మనోహర్, అఖిల భారత పంచాయతీ పరిషత్ కార్యదర్శి జాస్తి వీరాంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాంబశివరావు, శిరీషా సుధాకర్ తదితరులు తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్న డాక్టర్ ప్రీతిని పరామర్శించారు. సర్పంచ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగిస్తున్న ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది

చెరుకుపల్లి: రైతులు తమ పొలాల్లో రసాయన ఎరువులు అధికంగా వాడకుండా సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏపీసీఎన్ఎఫ్ ప్రతినిధి జ్యోతి రైతులకు సూచించారు. మండల పరిధిలోని రాజవోలు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ పురుగు మందులు అధికంగా వాడటం వల్ల భూసారం తగ్గిపోతుందని భూమిలో ఉన్న సూక్ష్మజీవులు చనిపోతాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారం పెరిగి రైతుకు ఖర్చు తగ్గి ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవచ్చన్నారు. అనంతరం నవ ధాన్యాలు సాగుచేద్దాం – పుడమి తల్లిని కాపాడుదాం అంటూ గ్రామంలో రైతులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్‌పీ ఎంఏ జ్యోతి, వీఆర్‌ఓ శాంతి కుమార్, నెహ్రూ, రైతులు పాల్గొన్నారు.

సీతారామస్వామి ఆలయంలో జీవధ్వజ ప్రతిష్ట



జీవ ధ్వజ ప్రతిష్ట నిర్వహిస్తున్న దృశ్యం

తెనాలిటౌన్: రూరల్ మండలం నేలపాడు గ్రామంలో హనుమత్ సీతాలక్ష్మణ సమేత సీతారామస్వామి వారి ఆలయంలో శనివారం సంప్రోక్షణ, జీవ ధ్వజ ప్రతిష్టా కార్యక్రమం వైభవంగా జరిగింది. వైఖానస ఆగమోక్తయుగా సీతారామస్వామి ఆలయ సంప్రోక్షణ నూతన శిఖర ధ్వజ ప్రతిష్ఠను అర్చకులు నిర్వహించారు. ఉదయం ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనము, యంత్రపూజ, పుష్పావాసము, నివేదన, నీరాజనము జరిపారు. అనంతరం పూర్ణాహుతి, సీతారామ కల్యాణం నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రావి సాయిబాబు, అభివృద్ధి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. భక్తులు పూజలు జరిపారు. అన్నప్రసాద వితరణ చేశారు.

హత్యాయత్నం కేసులో స్నేహితుడే నిందితుడు

- తను ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకున్నాడనే ఘాతుకం!
- మరో ఇద్దరితో కలిసి దారుణం

తెనాలి రూరల్: తెనాలిలో ప్రైవేటు ఉపాధ్యాయుడిపై శుక్రవారం రాత్రి హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. అయితే తాను ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకున్నాడన్న కారణంతో అతని మిత్రుడే ఈ ఘాతుకానికి పాల్పడినట్టు తెలుస్తోంది. క్షతగాత్రుడు పల్లపురం గణేష్‌బాబు గతంలో నందులపేటలో నివసించేవాడు. అదే ప్రాంతానికి చెందిన బాషా, బాబి, అరవింద్ ఇతర యువకులు గణేష్‌బాబుకు మిత్రులు . వీరిలో బాషా నందులపేటకు చెందిన యువతిని ప్రేమించేవాడు. 2018 డిసెంబర్‌లో ఫొటోగ్రాఫర్ రబ్బాని, మరో యువకుడిపై కత్తితో దాడి చేసిన కేసులో బాషా జైలుకు వెళ్లగా అతను ప్రేమించిన యువతి గణేష్‌బాబుకు దగ్గరైంది. ఇద్దరూ గతేడాది వివాహం చేసుకున్నారు. ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పనిచేసే గణేష్‌బాబు ప్రస్తుతం నాజరుపేటలో నివసిస్తున్నాడు. పాఠశాల అనంతరం ఇంటివద్ద విద్యార్థులకు ట్యూషన్‌లు చెప్పుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం రాత్రి బాషా, బాబి, అరవింద్ నాజరుపేటలోని గణేష్‌బాబు ఇంటికి వెళ్లి అతన్ని బయటకు వెళదామని పిలిచారు. వారి వెంట గణేష్‌బాబు మరో బుల్లెట్‌పై నందులపేట వెళ్లగా అక్కడ బాషా, మిగిలిన ఇద్దరూ కత్తితో గణేష్‌బాబు గొంతు కోసినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. కత్తితో దాడి అనంతరం బుల్లెట్‌పై ఎక్కించుకుని మరో ప్రాంతానికి తీసుకెళుతుండగా, గణేష్‌బాబు వాహనం నుంచి దూకి వారి నుంచి తప్పించుకుని నెహ్రూ రోడ్డులోని ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి చేరాడు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం తాడేపల్లిలోని ఒక ప్రైవేటు వైద్యశాలకు పంపారు. గణేష్‌బాబు నివసించేది వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో, అతనిపై కత్తితో దాడి జరిగింది టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కావడంతో రెండు ప్రాంతాలనూ వన్‌టౌన్, టూ టౌన్ సీఐలు కె. చంద్రశేఖర్, ఎస్.వెంకట్రావు పరిశీలించారు. టూటౌన్ పరిధిలో ఘటన జరగడంతో ఆ పోలీసులే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేసు దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు బాషా, మరో యువకుడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. ఘటన జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరా ఫుటేజీలనూ పోలీసులు పరిశీలించి సాక్ష్యాలను సేకరించినట్టు తెలిసింది. తాను ప్రేమించిన యువతిని వివాహం చేసుకున్నడన్న కారణంతో బాషా తన మిత్రులతో కలసి ఘాతుకానికి పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

సకాలంలో టీకాలతో చిన్నారులకు ఆరోగ్యం

జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ వీరసుబ్బరాజు



వ్యాక్సిన్ ప్రక్రియను, రికార్డులను పరిశీలిస్తున్న వీరసుబ్బరాజు

కొల్లిపర: ప్రతి గ్రామంలో చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలు చిన్నారులకు క్రమం తప్పకుండా వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ కుర్రా వీరసుబ్బరాజు అన్నారు. శనివారం మండలంలోని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో రూబెల్లా అరికట్టు కార్యక్రమంలో భాగంగా పలుగ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాక్సిన్ భద్రపరిచే శీతలీకరణ పెట్టెలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు ప్రతి తల్లిదండ్రులు తమ చిన్నారులకు ప్రభుత్వం చెప్పిన విధంగా అందించి భవిష్యత్‌లో వారికి ఎటువంటి వ్యాధులు రాకుండా ఉండేలా చూడాలన్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక, పర్యవేక్షకులు వావిలాల సీతారామశాస్త్రి, ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, వంగర బుజ్జిబాబు, సోషల్ హెల్త్ వర్కర్ ఎస్.కోటేశ్వరి, స్టాఫ్‌నర్స్ జి.కల్పన, ఎం.ఎల్ నాగమణి, ఏఎస్‌ఎం ఆకురాతి నాగయామిని, షేక్ మస్తాన్‌బి, ఆషాకార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు జిల్లా మహిళల వాలీబాల్ జట్టుకు సత్కారం

తెనాలి: పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరులో ఇటీవల జరిగిన సీనియర్‌అంతర జిల్లాల వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతగా నిలిచిన గుంటూరు జిల్లా మహిళల వాలీబాల్ జట్టు క్రీడాకారులకు ఆదివారం తెనాలిలో సత్కారం జరగనుంది. గుంటూరు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు ఇక్కడి అమరావతి కాలనీలో గల అన్నాబత్తుని సత్యనారాయణ క్రీడాస్టేడియంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేస్తున్నారు. జిల్లాకు చెందిన మహిళా వాలీబాల్ క్రీడాకారులు ఉన్నతస్థాయిల్లో ఆడుతున్నప్పటికీ, రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా మహిళల జట్టు టీమ్ ఛాంపియన్‌షిప్‌ను సాధించటం ఇదే తొలిసారి. ఈ విజయాన్ని సాధించి పెట్టిన జట్టును అసోసియేషన్ తరపున సత్కరించటం ప్రోత్సాహకరంగా ఉంటుందని ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్టు కార్యదర్శి ఎస్.నిరంజనరావు తెలియజేశారు. రాష్ట్ర విజేతగా నిలిచిన జట్టులో జిల్లా వాలీబాల్ క్రీడాకారిణులు ఎస్.మౌనిక, ఏవీఎస్ పార్వతి, ఎ.మానస, టి.లక్ష్మీసాయి దుర్గ, ఎం.యామిని, బి.ఆషా, ఎం.జ్యోత్స్న, ఎం.సుమశ్రీ, పి.షహీద, టి.పల్లవి సాయిశ్రీ, ఎస్.సువర్ణ, వి.సుప్రియ ఉన్నారు. కోచ్‌గా కె.కోటేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్‌గా బీఎల్ కాంతమ్మ వ్యవహరించినట్టు నిరంజనరావు వివరించారు.

విలువలతో కూడిన విద్యతో ప్రగతి

తెనాలి: ప్రైవేటురంగంలో విద్య, వైద్యం వ్యాపారంగా మారిన నేటి కాలంలో విద్యార్థులు డిగ్రీలు సాధిస్తున్నా మానవతా విలువలు పాటించకపోవటం కుటుంబ, సామాజిక సమస్యగా మారిందని పారిశ్రామికవేత్త నంబూరి వెంకట కృష్ణమూర్తి అన్నారు. విద్యాసంస్థలు, విద్యార్థులు విలువలతో కూడిన విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూల్ ఆడిటోరియంలో శనివారం వివేక ఫాస్టర్ స్కూలు విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణమూర్తి ప్రైమరీ క్లాస్ విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. విశిష్ట అతిథి స్వామి భాస్కరనంద సరస్వతి ప్రవచిస్తూ, పిల్లల చదువు, సంస్కారం, క్రమశిక్షణపై తల్లిదండ్రులు పరిశీలన చేస్తూ లోపాలను సవరిస్తుండాలని సూచించారు. వివేక విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో వందలాది చిన్నారులు ప్రత్యేక దుస్తులు, టోపీలు ధరించి పట్టాలను అందుకున్నారు. అతిథులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ఫొటోలు దిగుతూ సందడి చేశారు. వివేక విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు పర్యవేక్షించారు. ఫాస్టర్ స్కూల్ ప్రిన్సిపాల్ రాధాకృష్ణమూర్తి, శంకరరావు, మురళి, స్వప్న, రాంబాబు, రాధిక, నవీన్, శివకుమార్ పాల్గొన్నారు.

స్వధార్ హోమ్‌లో అన్నదానం

తెనాలిఅర్బన్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జేఎంజే స్వధార్ హోమ్‌లోని అనాథలకు శనివారం అన్నదానం చేశారు. అలాగే వారికి అవసరమైన సబ్బులు, నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు చిలకా కిరణ్‌మాదిగ మాట్లాడుతూ మాజీ మంత్రి, దళిత నాయకుడు రావెల కిషోర్‌బాబు జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. సొపాటి కిరణ్, రాజారత్నం, రాకేష్, మేరుగ రవి, అత్తోట ప్రసాద్, గణేష్ గౌడ్, పినపాటి నీరంజన్ పాల్గొన్నారు.

పలు ఆశ్రమాల్లో ..

తెనాలిటౌన్: నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆంజనేయం ధ్యానయోగ మండలి సభ్యులు శనివారం అల్పాహారం అందజేశారు. నిష్కామకర్మ యోగంలో భాగంగా వృద్ధులకు అల్పాహారం అందించినట్లు యోగ మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ తెలిపారు. సీనియర్ యోగ సభ్యురాలు కోమల మాతాజీ సహకారంతో సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముంతా శ్రీనివాసరావు, తాడికొండ శ్రీనివాసరావు, కూరపాటి నాగరాజు, భూపతి, నాగేశ్వరరావు, సుబ్బారావు, కోమల మాతాజీ, గొడవర్తి సత్యనారాయణ, పలువురు యోగ సభ్యులు పాల్గొన్నారు. గాంధీనగర్‌లోని షిరిడీసాయి వృద్ధాశ్రమంలో శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, కొలివరం మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు, భరత్‌స్వామి, హేమంత్‌బాబు, కృష్ణకుమారి, రాజకుమారి, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

తాడికొండ: కేంద్రం ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మేడా హనుమంతరావు అన్నారు. తాడికొండలో నిర్వహించిన ఏఐటీయూసీ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత బస్టాండ్ సెంటర్ నుంచి మార్కెట్ యార్డు వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పేరుతో ఉద్యోగాలు భర్తీ చేయడం తగదని, పర్మినెంట్ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పీఎఫ్, ఇన్సూరెన్స్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలని, ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ కార్మికులకు అన్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాజధాని ప్రాంత కార్యదర్శి జీవీ రాజు, ఏరియా అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివ శంకరరావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చల శివాజీ, నాయకులు గుర్రంకొండ సత్యానందం, చింతల భాస్కరరావు, వ్యకాస కార్మిక సంఘం నాయకులు కంభంపాటి దేవునిదయ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అండగా ఎమ్మెల్యే ఆర్కే



ఆర్థిక సాయం అందజేస్తున్న దుగ్గిరాల ఎంపీపీ సంతోషరూపవాణి

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే అండగా నిలుస్తున్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామానికి చెందిన షేక్ బీబీజాన్, నెమలికంటి ప్రకాష్, అద్దంకి వెంకటేశ్వర్లు, మేకల నల్లబ్బాయి చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి వ్యాపారానికి తోడ్పాటును అందించేందుకు శనివారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, వైఎస్సార్ సీపీ నాయకుల చేతుల మీదుగా వారికి తోపుడు బండ్లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్డేశ్వరపు రజనీకాంత్, షేక్ జానీ, షేక్ సుభాని, తురకా మోహన్‌దాస్, నెమలికంటి బాబూరావు, జంషాద్ ఖాన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని నల్లమేకలవారిపాలేనికి చెందిన వృద్ధురాలు తుల్లిమిల్లి భద్రమ్మ ఇటీవల అనారోగ్యం పాలై ఇబ్బంది పడుతున్న కారణంగా బాధితురాలికి రూ.20 వేలు, ఇదే గ్రామానికి చెందిన మహిళ కాజ నాగమ్మ ఇటీవల శస్త్రచికిత్స జరిగి కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మరో 20 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఆ మొత్తాన్ని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు శనివారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పిల్లి ధర్మరత్నం, మత్తె ఆనంద్, జమ్ముల లోకేష్, షేక్‌జానీ బాషా, వడ్డేశ్వరపు రజనీకాంత్, మేరుగ ఆనంద్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్దకు చేరుకున్న పాదయాత్ర

మంగళగిరి: ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం వెంటనే చట్టబద్ధత కల్పించాలని వచ్చే పార్లమెంట్ సమావేశాలలో బిల్లు ఆమోదింపజేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోరుతూ ఈనెల 27వ తేదీ చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టగా ఈ నెల 24వ తేదీన పొన్నూరు మండలం నిడుబ్రోలు నుంచి ప్రారంభమైన పాదయాత్ర శుక్రవారం రాత్రి మంగళగిరి చేరింది. శనివారం మంగళగిరిలోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నుంచి పాదయాత్ర ప్రారంభమై నిడమర్రు, కురగల్లు, ఐనవోలు మీదుగా పెదపరిమి చేరింది. పాదయాత్రలో ఎమ్మార్పీఎస్ నాయకులు వేమూరి సుధాకర్, కూచిపూడి సత్యం, కలకోటి నాగేశ్వరరావు, పులివర్తి నథానియేల్, ఇందుపల్లి రామారావు, చందోల్ విక్టర్‌పాల్, వాణి, ఉండిమెడ నాగేంద్రం పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తెనాలిరూరల్: దాడి ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ గంగానమ్మేటకు చెందిన కొప్పుల శ్రీనివాసరావు శుక్రవారం మధ్యాహ్నం శాలిపేటలోని ఓ బార్‌లో మద్యం తాగి బయటకు వచ్చి ఫోన్ మాట్లాడుతుండగా నందులపేటకు చెందిన కొడాలి గోపికృష్ణ అలియాస్ గోపి అతనితో వాగ్వాదానికి దిగాడు. అంతటితో ఆగకుండా దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు శనివారం నమోదు చేసినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.